# శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠినచర్యలు

## జగిత్యాల జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని ఏప్రిల్ 1వ తేది నుండి 30 తేది వరకు నెల రోజుల పాటు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లాలో ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్లులు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్.పి. సూచించారు. కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.


ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి




# మూలమలుపులు మృత్యులోగిళ్లు

### ప్రమాదాలకు నిలయంగా చొప్పదండి రోడ్లు
### హెచ్చరిక, సూచిక బోర్డులు కరువు
### పట్టించుకోని సంబంధిత అధికారులు

**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లలో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. నిత్యం వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతూ భయం గుప్పిట్లో ప్రయాణిస్తున్నారు. మరో వైపు రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు, చెట్ల కొమ్మలను అధికారులు తొలగించకపోవడంతో రోడ్లను కమ్మేస్తున్నాయి. ఫలితంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలకు కారణమవుతున్నాయి. చొప్పదండి మండలం నుంచి పల్లెలకు వెళ్లే రహదారులపై ప్రయాణం అంటేనే వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు. మూలమలుపులు గమనించక ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న సంఘటనలున్నాయి. మరికొందరు క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు. అయినప్పటికీ అధికారులు ప్రమాదకర మూలమలుపుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయడం లేదని వాహన చోదకులు వాపోతున్నారు. రోడ్లను కమ్మేస్తున్న చెట్ల కొమ్మలను, ముళ్లపొదలను తొలగించడంపై ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలు కోల్పోతున్నారని, వికలాంగులుగా మిగులుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఈ రోడ్లు ప్రమాదకరమైనా.. పట్టించుకోరే?**

చొప్పదండి పట్టణం నుంచి గుమ్లాపూర్ వెళ్లే మలుపు, చొప్పదండి నుంచి వెదురుగట్ట వెళ్లే మలుపు, మూడు రోడ్ల కలయికతో ప్రమాదకరంగా ఉన్నప్పటికీ రోడ్డుపైన రేడియం మార్కింగ్‌లు గానీ, స్పీడ్ లిమిట్ బోర్డులు గానీ, మలుపు ఉన్నట్లు సూచిక బోర్డులు గానీ లేకపోవడంతో ప్రధాన రహదారిపై వస్తున్న వాహన చోదకులు


తరువాయి 2లో




### సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



**ముస్కె వెంకట్ రెడ్డి,గుమ్లాపూర్ మాజీ సర్పంచ్**

చొప్పదండి నుంచి రామడుగు వెళ్లే దారిలో మధ్యలో చాలా మూలమలుపులు ఉన్నాయి. మూల మలుపుల వద్ద సూచిక, హెచ్చరిక బోర్డులు లేక చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

## పోచారంలో కల్లు సీసాలో

# పురుగులు ప్రత్యక్షం



**ప్రజాపక్షం/ ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల పరిధిలోని పోచారం గ్రామంలో ఉన్న కల్లు బట్టిలో బుధవారం ఓ కల్లు సీసాలో పురుగు రావడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. కల్లు సీసాలో ఓ పురుగు యధేచ్ఛగా తిరుగుతుండగా అది గమనించిన వారు ఫోన్‌లో వీడియో తీశారు. గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న కల్లు బట్టిలో బెజ్జంకి శంకర్‌తో పాటు మరి కొందరు కల్లు తాగుతుండగా సీసాలో పురుగులు వచ్చాయి. దీంతో ఆగ్రహించిన వారు విక్రయదారులను నిలదీశారు. ప్రతిరోజు సీసాలను కడకపోవడంతోనే కల్లు సీసాల్లో పురుగులు వస్తున్నాయని ఆరోపించారు. అయితే కల్లు సీసాలు శుభ్రం చేయడం లేదని, ఇష్టారీతిన కల్తీ కల్లు విక్రయిస్తున్నారని, ఇదేమిటని అడిగితే నిర్వహకులు సైతం నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా జరిగితే డబ్బులు ఇస్తామని కల్లు విక్రయదారులు చెప్పడం గమనార్హమని బెజ్జంకి శంకర్ పేర్కొన్నారు. ఇకనైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించి నాణ్యమైన కల్లు విక్రయించేలా చూడాలని కల్లు ప్రియులు కోరుతున్నారు.

# మరో యువకుడిని బలిగొన్న ఆన్‌లైన్ బెట్టింగ్

### రూ.5 లక్షలు పోగొట్టుకుని ప్రాణం తీసుకున్న యువకుడు



**ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి :** ఆన్‌లైన్ బెట్టింగ్ మరో యువకుడిని బలి తీసుకుంది. ఆన్‌లైన్ గేమ్‌లో ఐదు లక్షల రూపాయలు పోగొట్టుకుని తీవ్ర మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ పేజీకి విషాధాకర సంఘటన నిజామాబాద్ రూరల్ మండలం ఆకుల కొండూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఆకుల కొండూర్‌కు చెందిన ఆకాష్(22) గత కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్‌కు బానిసగా మారాడు. ఈ మధ్యకాలంలో ఐదు లక్షల రూపాయల ఆన్‌లైన్ గేమ్‌లో పోగొట్టుకుని ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై విషయాన్ని భార్యకు కానీ తల్లిదండ్రులకు గానీ తెలిస్తే ఏమవుతుందోనని తనలో తానే మదనపడి ఆత్మహత్య చేసుకోవడమే శరణ్యంగా భావించాడు. గత మార్చి 26న గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆకాష్‌ను వెంటనే జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి యువకుడు మంగళవారం అర్ధరాత్రి చనిపోయాడు. ఆకాష్ చనిపోవటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆకులకొండూర్ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బెట్టింగ్ యాప్‌లపై ఉక్కుపాదం మోపిన విషయం తెలిసిందే. ఓవైపు చర్యలు చేపడుతుంటే మరో వైపు యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌కు ఆకర్షితులు కావటం లక్షల్లో డబులు పోగొట్టుకోవడం సర్వసాధారణం మారింది. ఇదే తరహాలో జిల్లాలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకోవడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. జిల్లా సీపీగా బాధ్యతలు స్వీకరించిన సాయిచైతన్య యువతకు పలు సందేశాలు ఇచ్చారు. బెట్టింగ్ యాప్‌ల వైపు ఆకర్షితులు కావద్దని, తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. సీపీ సూచించిన వారం రోజుల వ్యవధిలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌కు ఆకాష్ అనే యువకుడు తన నిండు ప్రాణాన్ని బలి తీసుకున్న సంఘటన పలువురి హృదయాలను కలిచివేసింది. పోలీసు అధికారులు యువకుని మృతిపై సీరియస్‌గా పరిగణించి బెట్టింగ్ యాప్‌లను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు. తమ జీవితాలను అంధకారంగా మారుస్తున్న ఇలాంటి బెట్టింగ్ యాప్‌లకు యువత దూరంగా ఉండాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

# కష్టమర్లకు నాణ్యమైన భోజనం



**ప్రజాపక్షం/ పెద్దపల్లి రూరల్ :** క్యాంటీన్ కు వచ్చే కష్టమర్లకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈశ్వర ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద వివిధ యూనిట్ల స్థాపనకు సహకారం అందిస్తుందని, ఇందులో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్లో క్యాంటిన్ నిర్వహణ బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించామని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్లో క్యాంటీన్ కి వచ్చే ప్రభుత్వ అధికారులు సిబ్బంది, ఇతర కస్టమర్లకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ సూచించారు. క్యాంటీన్ నిర్వహణలో రుచికరమైన భోజనం అందించడంతో పాటు క్వాలిటీ మైంటైన్ చేయడం, పరిసరాలలో శుభ్రంగా ఉంచడం చాలా కీలకమని కలెక్టర్ తెలిపారు. మహిళలు వ్యాపార దృక్పథంతో క్యాంటీన్ నడుపుతూ మంచి లాభాల సంపాదించాలని, అదే సమయంలో నాణ్యత అంశంలో ఎక్కడ రాజీ పడవద్దని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, ఏ. ఓ . శ్రీనివాస్ ,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సమృద్ధిగా సన్న బియ్యం సరఫరా



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** పేదలకు సమృద్ధిగా సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలోని గ్యాస్ గోదాం వద్ద గల సుభాష్ నగర్ లో ప్రభుత్వం చేపట్టిన రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని రేషన్ షాపులలో తెల్ల కార్డు దారులకు ఇక నుంచి ప్రతి నెల సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వానాకాలం వరి పంట కొనుగోలు సమయంలో రైతులకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ చెల్లించి సన్న రకం ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.కొనుగోలు చేసిన సన్న రకం ధాన్యాన్ని మిల్లింగ్ చేయించి పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ఉన్న 413 చౌక ధరల దుకాణాల ద్వారా ఇక నుంచి సన్న రకం బియ్యం మాత్రమే పంపిణీ చేయడం జరుగుతుందని, దీనికీ అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లాలో 4 లక్షల క్వింటాళ్ల సన్న రకం బియ్యం రేషన్ షాప్ లో వద్ద అందుబాటులో ఉంచామని, పేదలకు అవసరమైన మేర బియ్యం అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో అధిక సంఖ్యలో సన్న రకం ధాన్యం పండటంతో మన జిల్లా అవసరాలు తీరడంతో పాటు ఆసిఫాబాద్ జిల్లాకు కూడా ఎగుమతి చేశామని కలెక్టర్ తెలిపారు.నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఎక్కడ క్వాంటిటీ లో తేడా రాకుండా చూడాలని కలెక్టర్ సంబంధిత అధికారులు, రేషన్ డీలర్లను ఆదేశించారు. ప్రజల కూడా ప్రభుత్వ అందిస్తున్న సందర్భంగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.కార్యక్రమంలో పాల్గొన్న పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా మన ముఖ్యమంత్రి చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకొని ఉగాది పండుగ నుంచి పేదలకు సన్న బియ్యం రేషన్ ద్వారా సరఫరా చేస్తున్నారని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గం లో 55 రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం సరఫరా కార్యక్రమం జరుగుతుందని, అవసరమైన పరిస్థితులు ఉంటే అదనపు షాపులు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్, డి.యం. శ్రీకాంత్ , సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌పిని కలిసిన ఆర్‌టిసి డిపో మేనేజర్ కల్పన



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్‌ను ఆర్టీసి డిపో మేనేజర్ కల్పన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎ స్పీ ఆర్టీసి మేనేజర్‌కు కల్పనకు కృతజ్ఞతలు తెలిపారు.

## పొంచి ఉన్న పెను ప్రమాదం

**ప్రజా పక్షం/ముత్తారం :** ముత్తా రం మండలం లోని లక్కారం గ్రామంలోని మూలమలుపు వద్ద ప్రమాదం పొంచి ఉంది. ప్రధాన రహదారిని ఆనుకొని ఉండి గ్రామానికి వెళ్లే డ్రైనేజీ కాలువపై ఉన్న కల్వర్టు కూలి గుంత ఏర్పడింది. ఈ గుంత కారణంగా ప్రమాదం సంభవించే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు ఈ మార్గం గుండా వెళ్లే క్రమంలో గమనించకపోతే గుంతలో పడే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రాత్రివేళలోనైతే ఈ పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. ఇప్పటి కైనా అధికారులు స్పందించి కల్వర్టుపై ఏర్పడిన గుంత వద్ద ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోక ముందే మరమ్మత్తు చర్యల చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## చలో సుల్తానాబాద్ పోస్టర్లు ఆవిష్కరణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** ఈనెల 8న సుల్తానాబాద్ సాయి గార్డెన్‌లో నిర్వహించతలపెట్టిన జిల్లా బ్రాస్ బ్యాండ్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా2వ మహాసభలను విజయవంతం చేయాలని ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగులమల్యాల రామయ్య కోరారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో బుధవారం చలో సుల్తానాబాద్ పోస్టర్లు ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజన్న, పట్టణ అధ్యక్షుడు రాజ్ మహమ్మద్, ఎండి సాయిబాబే సేన్, లక్ష్మీ నారాయణ, రాచకొండ చందు, సోనాయి శంకర్, సోనాయి ప్రశాంత్ కుమార్, బిడుదల మల్లయ్య, కల్లేపల్లి లింగయ్య, గద్దెల రాజు, ఏదునూరి భూమయ్య, తదితులు పాల్గొన్నారు.

## ఉచిత రేషన్ బియ్యం పంపిణీ చేసేది కేంద్ర ప్రభుత్వమే

తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాడు డా. బోగ శ్రావణి




**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** తెలంగాణతో సహా దేశవ్యాప్తంగా ఉన్న పేదలకు గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తోందని తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. బోగ శ్రావణి అన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన రేషన్ కార్డుల మంజూరు కార్యక్రమంలో భాగంగా జారీ చేసే కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోటోను ముద్రించాలని భారత ఆహార భద్రత చట్టం ప్రకారం నిరుపేదలకు పదివేల కోట్లు సబ్సిడీ ఇచ్చి ఉచితంగా కేంద్రం బియ్యం పంపిణి చేస్తే అది రాష్ట్ర ప్రభుత్వం గొప్ప అని చెప్పుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటని అన్నారు. పేదలకు ఇస్తున్న ప్రతి కిలో బియ్యం మీద కేంద్రం ఖర్చు 40 రూపాయలు చేస్తుందని, కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని పేదలందరికీ ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తున్న విషయా న్ని గురించి ప్రజలకు తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా స్థానికంగా ఉన్నటువంటి రేషన్ షాప్ ల వద్ద ప్రతి బిజెపి కార్యకర్తలు వెళ్లి కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యాన్ని గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిందిగా కోరుతున్నాను. కరోనా సమయం గత ఐదు సంవత్సరాల నుండి ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద తెలంగాణాలోని మూడు కోట్ల యాభై లక్షల మందికి ప్రతి నెల కేంద్ర ప్రభుత్వం తరుపున నెలకు 5 కిలోల బియ్యాన్ని ఉచితంగా ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కేవల 1 కిలో మాత్రమే బియ్యం ఇచ్చుకుంటూ 6 కిలోలు బియ్యం రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తున్నామని చెప్పుకుటున్నారన్నారు. కాబట్టి తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే కొత్త రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి ఫోటో సంభంధిత శాఖ మంత్రి ఫోటోతో పాటు ప్రోటోకాల్ ప్రకారం ప్రధానమంత్రి ఫోటో కూడా ముద్రించాలని డా. భోగ శ్రావణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రేషన్‌కార్డులు వెంటనే అందజేయాలి

బిజెపి కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/చొప్పదండి:** రేషన్‌షాపుల ద్వారా పేదలకు సప్లై చేస్తున్న బియ్యంపై భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతి కిలోకు రూ.40 సబ్సిడీ ఇస్తుందని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి వివరించారు. బిజెపి చొప్పదండి రూరల్ మండల అధ్యక్షుడు మొగిలి మహేష్ ఆద్వర్యంలో బిజెపి నాయకులు చొప్పదండి మండలంలోని రాగంపేట, ఆర్నకొండ, కొలిమికుంట, భూపాలపట్నం తదితర గ్రామాల్లోని ప్రజాపంపిణీ వ్యవస్థ రేషన్ షాపులను సందర్శించిన వినియోగదారులతో మాట్లాడారు. ఈ సంధర్భంగా రాగంపేటలో కృష్ణారెడ్డి మాట్లాడుతూ పేదలకు ఆహార భద్రత కల్పించడం కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా బియ్యాన్ని ఉచితంగా సరఫరా చేస్తున్నదని, ప్రతి కిలో బియ్యంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రూ.40 సబ్సిడీని భరిస్తున్నదని తెలిపారు. బిజెపి జి ల్లా కౌన్సిల్ సభ్యులు గొల్ల గట్టయ్య, మాజీ ఎంపిటిసి తోట కోటేష్, మాజీ సర్పంచ్ ఏలేటి తిరుపతి రెడ్డి, సింగిరెడ్డి భూమిరెడ్డి, మొగిలి సారయ్య, బైరగోని కిట్టుగౌడ్, సింగసాని మేకల కనకయ్య, మధుసూధన్ రెడ్డి, జక్కుల అంజయ్య, గుండె వెంకటేస్, ఐలయ్య, వెంకటరమణ, విఠల్, రామకృష్ణ, రాజయ్య, అనిల రవి, అశోక్, గంగరాజు, మునీందర్, సంపత్, , రాజు తదితరులున్నారు.

## పోలీసుల నిర్బంధంతో పాలన సజావుగా ఉండదు..!

బిజెపి మోర్చా నాయకురాలు పల్లం అన్నపూర్ణ, దాసరిపూర్ణిమ

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** అక్రమ అరెస్టులు,నిర్బందాలతో ప్రభుత్వ పాలన సజావుగా కొనసాగదని రాజన్నసిరిసిల్లా బీజేపి మహిళమోర్చా అద్యక్షురాలు పల్లం అన్నపూర్ణ మండల అద్యక్షురాలు దాసరిపూర్ణిమ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిపేట నుండి హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడికి వెలుతున్నారని తెలుసుకుని పోలీసులు వాహనాన్ని హైదరాబాద్‌లో ఆపారు. రాంగోపాల్‌పేట పోలీసు స్టేషన్ పోలీసులు వారిని నిర్భందించారు.అసెంబ్లీ ముట్టడించడానికి వెలుతున్నారని సమాచారం తెలుసుకుని అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటి ప్రాంతంలో చెట్లను నరికడం,పర్యవరణం నాశనం చేయడం ప్రభుత్వానికి తగదని మహిళానాయకులు అన్నారు.ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేయడం తగదని వారన్నారు. జిల్లా కార్యదర్శి కర్నే హరిష,పట్టణ అద్యక్షురాలు వైశాలి,ఎల్లారెడ్డిపేట మోర్చాఅద్యక్షురాలు దాసరి పూర్ణిమ ఉన్నారు.

## మూలమలుపులు మృత్యులోగిళ్లు

(మొదటి పేజీ తరువాయి)

వాహనాన్ని నియంత్రించకపోవడంతో ఇక్కడ పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగినట్లు పోలీసు రికార్డులు తెలియజేస్తున్నాయి. అదే విధంగా చొప్పదండి నుంచి గోపాలరావుపేట వెళ్లే రోడ్డుపై ఆర్నకొండ మలుపు వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు,స్పీడ్ లిమిట్ బోర్డులు లేకపోవడంతో రాగంపేట నుంచి వచ్చే ప్రజలు ప్రమాదాలపాలవుతున్నారు. చొప్పదండి మున్సిపాలిటీలో సెంట్రల్ లైటింగ్ , రోడ్డు డివైదర్ పనులు గత సంవత్సరమే నిలిచిపోవడంతో వాహనదారులు, దుకాణదారులు నానా ఇబ్బందులకు గురవుతున్నప్పటికీ మున్సిపాలిటీ అధికారులకు చీమకుట్టినట్లైనా లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసి రోడ్డు డివైదర్‌కు , డివైదర్ ప్రారంభంలో ఎలాంటి రేడియం మార్కింగ్‌లు , లైటింగ్ హెచ్చరికలు లేక గతంలో పలు వాహనాలు ప్రమాదానికి గురై మరణించిన సంఘటనలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు తూతూమంత్రంగా రేడియం బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ అవి సమర్ధవంతంగా కనిపించడం లేదని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. రోడ్డు డివైదర్, సెంట్రల్ లైటింగ్ పనుల కొరకు తీసిన గోతులలో తరచుగా వాహనాలు ఇరుక్కుపోవడం చొప్పదండిలో పరిపాటిగా మారింది. మున్సిపల్ అధికారుల పనితీరుతో మున్సిపాలిటీ అంటే ప్రజల్లో చులకనగా మారిందని చెప్పడంలో అతిశయోక్తి లేదంటున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు మేల్కొని మూలమలుపుల వద్ద హెచ్చరిక, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈ సతీష్ స్పందిస్తూ పంచాయతీరాజ్ పరిధిలో గల రాగంపేట రోడ్డును ఈ వేసవికాలంలో మరమ్మత్తుల అనంతరం సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్అండ్‌బి (రోడ్డు భవనాల శాఖ) ఏఈ సుధాకర్ స్పందిస్తూ చొప్పదండి రామడుగు రోడ్డుకు సంబంధించి మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన సూచిక హెచ్చరిక బోర్డులు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కావడంతోనే త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు

## పాపన్నకు కలెక్టరేట్‌లో ఘన నివాళి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** సర్దార్ సర్వార్ పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్వాయి పాపన్న చిత్రపటానికి కలెక్టర్ పమేలా సత్పతి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తి భవిష్యత్తు తరాలకు ఆదర్శమని అన్నారు. సామాజిక సమానత్వానికి పాటుపడిన మహనీయుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, బిసి సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, గౌడ సంఘం ప్రతినిధులు, బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు. గౌడ సంఘం జిలా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, గుగ్గిళ్ల శ్రీనివాస్, మాచెర్ల అంజయ్య, జక్కె వీరస్వామి, తాళ్లపల్లి హరికుమార్, సంపునూరి మల్లేశం, మునిగాల సుధాకర్, బుర్ర ముత్తయ్య, పురుషోత్తం సుగుణాకర్, ఆశిష్ గౌడ్, సాగర్ గౌడ్, అనిల్ గౌడ్ తదితరులున్నారు.

## అభినందనలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి ఆర్జీవన్ ఏరియాలోని జిడికె 2&2ఏ ఇంక్లైన్‌లకు సంబంధించిన క్యాంటీన్‌లలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు నూతనంగా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు స్వాగతం పలుకుతూ అభినందనలు తెలపడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, పిట్ కార్యదర్శులు పొన్నాల వెంకటయ్య, కారంపూడి వెంకన్న, ఏఐటియుసి ఆర్జీ వన్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.ఏ.గౌస్ లు కూడా పాల్గొని శుభాకాంక్షలు తెలపడం జరిగింది. అదేవిధంగా కాంట్రాక్ట్ కార్మికుల కు చట్ట ప్రకారం వేతనాలు, ఇతర అలవెన్సులు అమలు అయ్యే విధంగా యాజమాన్యం, కాంట్రాక్టర్ చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/రామడుగు:** దేశ చరిత్రలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విప్లవాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకం పేదల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఈ పథకం పేదలకు ఒక వరమని, ధనికులు తినే సన్న బియ్యాన్ని పేదలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. ఈ పథకాన్ని పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సన్న బియ్యం పంపిణీ పథకాన్ని రామడుగు మండలం వెదిర గ్రామంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ సన్నబియ్యాన్ని లబ్దిదారులకు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ప్రభుత్వం ఉన్నా సన్న బియ్యం పథకాన్ని అమలు చేసి తీరాల్సిందేనని, ఆ విధంగా పేదల కోసం పకడ్బందీగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన చేసి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలోనూ ఈ పథకం అమలు కావడం లేదని తెలిపారు. అర్హులైన లబ్దిదారులందరికీ ప్రతినెల 6 కిలోల చొప్పున సన్న బియ్యం అందించడం జరుగుతుందని తెలిపారు. పేదలు దొడ్డ బియ్యం తినలేరని, పిడిఎస్ బియ్యాన్ని మిల్లర్లు, దళారులు రీసైక్లింగ్ చేస్తున్నారని తెలిపారు. వీటన్నింటికీ ముఖ్యమంత్రి చెక్ పెట్టాలనే ఉద్దేశ్యంతోనే ప్రతి పేదవారి ఇంటా ప్రతి రోజు పండుగ జరగాలన్న ఆలోచనతో వారి కడుపు నింపాలన్న లక్ష్యంతో సన్న బియ్యం పంపిణీని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పథకాన్ని పౌరసరఫరాల శాఖ ద్వారా పకడ్బందీగా అమలు చేసి పేదవారికి అండగా ఉంటామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించి తీరుతుందన్నారు. భారత దేశం తెలంగాణ వైపు చూసేలా ఈ పథకాన్ని అమలు చేస్తామని, ఇది నిజమైన ఆహార భద్రత పథకం అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వనుందని, ఇది నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ పేదలకు సమృద్ధిగా సన్నబియ్యం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. జిల్లాలోని రేషన్ షాపుల ద్వారా ఇక నుంచి సన్నరకం బియ్యం మాత్రమే పంపిణీ చేయడం జరుగుతుందని, దీనికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.

## సర్దార్ సర్వాయి పాపన్నకు జిల్లా కలెక్టర్ ఘన నివాళి



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఘనంగా నివాళులు అర్పించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈవో వినోద్ కుమార్, బిసి సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్ రావు, ఎల్‌డిఎం మల్లిఖార్జున్ రావు, బిసి సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కారు ప్రమాదంలో విద్యార్థులకు తీవ్ర గాయాలు





**ప్రజాపక్షం / ధర్మపురి :** కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్న ఓ వ్యక్తి కారు అదుపు తప్పి విద్యార్థులను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని వెంటనే జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ధర్మపురికి చెందిన సంతోష్ అనే వ్యక్తి బుధవారం సాయంత్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కొత్తగా కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్నాడు. అదే సమయంలో మైదానంలో వాకింగ్ చేస్తున్న డిగ్రీ విద్యార్థులను కారు అదుపు తప్పి గోడకు ఢీకొనడంతో గోడకు కారుకు మధ్యలో విద్యార్థులు ఇరుక్కుపోయి తీవ్రగాయాలు అయ్యాయి. వారిలో స్థానిక మహాత్మాజ్యోతిభాపూలే డిగ్రీ కళాశాలకు చెందిన కూర్మాదాస్, వినయ్‌లకు తీవ్రగాయాలు కాగా, ప్రేమ్‌దాస్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. ఇద్దరు విద్యార్థులను వెంటనే 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించగా మరో విద్యార్థిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం జగిత్యాలకు తరలించారు. కారు డ్రైవింగ్ రాకనే అదుపు తప్పి ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## పాపన్నగౌడ్‌కు ఘన నివాళి

### జిల్లా బిసి అభివృద్ధి అధికారి రంగా రెడ్డి

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జే.రంగా రెడ్డి ఘన నివాళులు అర్పించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జే.రంగా రెడ్డి జ్యోతి పాల్గొని ప్రజ్వలన చేసి, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి ఆశయ సాధనకు పాటుపడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ బీసీ అభివృద్ధి అధికారి , జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు ఎం.అంజయ్య గౌడ, గౌడ సంఘ ప్రతినిధులు బాలసాని వెంకటేశం గౌడ్, ఇతర ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం పంపిణీ



**ప్రజాపక్షం / ముస్తాబాద్ :** పేద మధ్య తరగతి ప్రజలకు ఆహార భద్రత, ఉపాధి హామీ చట్టాలను తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లా బాల్ రెడ్డి అన్నారు. బుధవారం ముస్తాబాద్ మండల కేంద్రంలో రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల్ రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని అన్నారు. సియం రేవంత్ రెడ్డి మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి చలువతో ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేసి ఆర్థికంగా నిలదొక్కుకునేలా కృషి చేశారని అన్నారు. ఎన్నికల్లో హామీ ఇవ్వని సంక్షేమ పథకాలు సైతం కాంగ్రెస్ ప్రభుత్వం దశల వారీగా అమలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు పోతుందన్నారు. టిఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు, బిసి సెల్ మండల అధ్యక్షుడు ఆగర్ల రాజేశం, దీటి నర్సింహులు, రంజాన్ నరేష్, శిలా ప్రశాంత్, మామిళ్ల ఆంజనేయులు, విజయ్ రెడ్డి, సద్ది మధు, ఉచ్చిడి బాల్ రెడ్డి, గుండెల శ్రీనివాస్, నల్ల బాలేల్లు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## ‘ఆకాష్’ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి

### ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ నగరంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల వెళ్లేదారిలో ఉన్న ఆకాష్ విద్యా సంస్థ కోచింగ్‌ల పేరిట విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు దోచుకుంటుందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ ఆరోపించారు. దీనిని అరికట్టడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. జెఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ కోచింగ్‌ల పేరిట విద్యార్థుల నుంచి నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడో వచ్చిన వారి విద్యాసంస్థలోని ర్యాంకులు చూపిస్తూ ఇక్కడి విద్యార్థులను ఆకర్షించేందుకు పలు రకాలుగా ప్రకటనలు ఇస్తూ ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. తమ విద్యాసంస్థల్లో చదివితే ర్యాంకు తప్పకుండా వస్తుందనే మాయమాటలు చెబుతూ కోచింగ్, పుస్తకాలు, టీషర్ట్స్ పేరిట కోట్లాది రూపాయల విద్యావ్యాపారాన్ని కొనసాగించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విద్యాసంస్థల్లో చేరితే ర్యాంకు తక్కువ వచ్చినా తిరిగి కోచింగ్ తీసుకుని తప్పకుండా ర్యాంకు వస్తుందని సంవత్సరాల తరబడి కోచింగ్‌లు ఇస్తూ నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. విద్యార్థులు ఇలాంటి విద్యాసంస్థల మాయమాటల ఉచ్చులో పడకుండా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. తప్పుడు ప్రచారం చేస్తూ కోట్ల రూపాయలు విద్యార్థుల నుంచి దోచుకుంటున్న ఆకాష్ విద్యాసంస్థపై విద్యాశాఖ చర్యలు తీసుకోకపోతే లేని పక్షంలో ఆకాష్ విద్యాసంస్థల ఆగడాలపై ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

## సన్న బియ్యం వివరాలు తెలియజేయాలి

### బిజెపి జిల్లా అధ్యక్షులు గోపి

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** సన్న బియ్యం వివరాలు ప్రెస్ మీట్ ద్వారా రిలీజ్ చేయాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. బుధవారం బిజెపి జిల్లా కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. సన్న బియ్యం కార్యక్రమానికి వచ్చి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కాగితాలు తీసుకువచ్చి సన్న బియ్యం కాగితాలు తేక బిజెపికి ఎక్కడ మంచి పేరు వస్తుందోనని వేరే ముచ్చట చెప్పడం సరైన విధానం కాదని అన్నారు. కేసిఆర్ ప్రభుత్వంలో మీ ప్రభుత్వం ఎన్ని పనులు చేసుకున్నారో చెప్పాల్సిన అవసరం లేదని, ఏదో లక్కీ డ్రా తీస్తే మీ నెంబర్ వచ్చినట్లుగా మీ ప్రభుత్వం వచ్చిందని ఎద్దేవా చేశారు. మీ ప్రభుత్వం మీద నీకు నమ్మకం లేకనే వేరే దగ్గర నుండి పోటీ చేశావు అన్నారు. గడీల రాజ్యాన్ని బద్దలు కొట్టింది బండి సంజయ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రాం ప్రసాద్, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు రావుల రాజిరెడ్డి, నాయకులు పొన్నాల తిరుపతి రెడ్డి, ఎనగంటి నరేష్, గాజుల సదానందం,రాజు, శివప్రసాద్‌తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడిగా వినోద్ రెడ్డి

**ప్రజాపక్షం / హుజురాబాద్ :** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షులుగా నరెడ్ల వినోద్ రెడ్డి నియామకం అయ్యారు. ఈ మేరకు బుధవారం రోజున నియోజకవర్గ ఇంచార్జ్ వొడితెల ప్రణవ్ నియామకం పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ రెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, జిల్లా అధ్యక్షులు పత్తి మధు బాబు, డిసిసి అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ, నియోజకవర్గ ఇంచార్జ్ వొడితెల ప్రణవ్, పిసిసి సభ్యులు పత్తి కృష్ణారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి

**ప్రజాపక్షం / మల్లాపూర్ :** మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో భరతమాత కూడలి వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315వ వర్ధంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాపన్న గౌడ్ మండల అధ్యక్షుడు బండి లింగ స్వామి, మాజీ జెడ్పిటిసి సందిరెడ్డి శ్రీనివాస్, బిజెపి మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ నూతిపెల్లి రాజం, నాయకులు ముద్దం సత్యనారాయణ గౌడ్, కొమ్ముల జీవన్, ఆనంద్ గౌడ్, రవీందర్, మల్లయ్య, గౌడసంఘంసభ్యులు తదితరులు ఉన్నారు.

## అతిథి(గెస్ట్) లెక్చరర్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం / ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని మహాత్మా జ్యోతిభాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ పురుషుల గురుకుల డిగ్రీ కళాశాలలో గెస్ట్(అతిథి) అధ్యాపకుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎలగొండ రాధాకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మపురిలో ప్రథమ ద్వితీయ తృతీయ సంవత్సర విద్యార్థులకు గణితం, కామర్స్ సబ్జెక్టులు బోధించేందుకు ఎమ్మెస్సీ (గణితం), ఎం కాం 55శాతం, పిహెచ్/నెట్/సెట్ అర్హత గల అభ్యర్థులు బయోడేటాతో పాటు జిరాక్స్ ధృవపత్రాలతో ఈ నెల 5లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాధాకిషన్ తెలిపారు. ఫోన్ నెం. 8019429413, 9573227028లలో సంప్రదించాలిసిందిగా సూచించారు.

## సెస్ బైలా యాక్ట్‌కు వ్యతిరేకంగా పాలకవర్గం పని చేయడం లేదు

### సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** సెస్ బైలా ఆక్ట్‌కు వ్యతిరేకంగా పాలకవర్గం పని చేయడం లేదని, సెస్‌కు సరిపడా సిబ్బంది లేకున్న సెస్ అభివృద్ధికి నిరంతరం మా పాలకవర్గం కృషి చేస్తుందని సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. బుధవారం సెస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడారు. ఎస్ఎస్ఐ యూనిట్ యజమానుల విషయంలో కోర్టు ఆర్డర్‌ను ఫాలో అవుతున్నామని అన్నారు. పాలకవర్గం కక్షసాధింపు చర్యలు ఎలా అవుతాయని ప్రశ్నించారు. పాలకవర్గాన్ని బదనాం చేయడం సరైన విధానం కాదని అన్నారు. తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. బకాయిలు ఉండడం చేతనే కనెక్షన్లు తొలగించామని అన్నారు. సెస్ ఎండి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

# శ్రీసీతారామచంద్ర బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ జిల్లాలో ఈ నెల 4 నుంచి జరగనున్న ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఇల్లందకుంట శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సిపి గ ఔస్ ఆలం సమీక్షించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల నుంచి 16 వరకు ఇల్లందకుంట దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో స్వామివారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా విద్యుత్‌శాఖ అధికారులు అంతరాయం లేకుండా చూడాలని, అధిక లోటును దృష్టిలో ఉంచుకుని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.



భక్తులు వివిధ మార్గాల ద్వారా వచ్చే అవకాశం ఉన్నందున సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. బారికేడ్లు, లైటింగ్, తాగునీటి సదుపాయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లలో భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపించాలని సూచించారు. స్వామివారి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా లైవ్ టెలికాస్ట్ అయ్యేలా చూడాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు అవసరమైతే ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని తెలిపారు. శానిటేషన్ సిబ్బందికి భోజన వసతి కల్పించాలని అన్నారు. ఫైర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో ఇల్లందకుంట దేవస్థానం అతి పెద్దదని అన్నారు. ఈ సారి సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి భక్తుడికి భోజనం, తాగునీరు అందిస్తామని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ఉత్సవాల కోసం 6 పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేశామని తెలిపారు. సుమారు వేయి వాహనాలు పార్కింగ్ చేయవచ్చని అన్నారు. సిసి కెమెరాలో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా బారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, ఆర్డీవో రమేష్, ఏసిపి శ్రీనివాస్, ఆలయ ఈవో సుధాకర్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సిపి గౌస్ ఆలంలుబ్రహ్మోత్సవాలఏర్పాట్లనుపరిశీలించారు.

## అత్యవసర చికిత్స అందించి ప్రాణాలు కాపాడిన ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** క్లిష్టమైన పరిస్థితిలో ఉన్న ఒక మహిళకు అత్యవసర చికిత్స అందించి మహిళ ప్రాణాలు కాపాడారని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జూలపల్లి మండలం ముప్పిరి తోట గ్రామానికి చెందిన ఓ మహిళ కడుపునొప్పితో బాధపడుతూ స్థానిక పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ హాస్పటల్ లో చికిత్స నిమిత్తం బుధవారం సాయంత్రం(ఈరోజు) వెళ్ళారని. సకాలంలో స్పందించి వైద్య బృందం మెరుగైన చికిత్స అందించి, అత్యవసరమైన శాస్త్ర చికిత్స నిర్వహించి,మహిళకు అవసరమైన రక్తాన్ని కూడా సకాలంలో సమకూర్చి చికిత్స అందించి మహిళ ప్రాణాలు కాపాడారని ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సకాలంలో వైద్య సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. శాస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్య బృందం,డాక్టర్ స్రవంతి, డాక్టర్ స్వాతి, డాక్టర్ భవాని, మరియు జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్ లను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. అవసరమైన రోగులు ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గోవిందుపల్లి గ్రామానికి చెందిన బింగి వెంకటమ్మ (72)అనే వృద్ధురాలు గత కొన్ని సంవత్సరాల నుంచి థైరాయిడ్ ,షుగర్ వ్యాధులతో బాధపడుతూ డాక్టర్ల సలహా మేరకు మందులు వాడుతూ ఉండగా గత 20 రోజుల క్రితం వెంకటమ్మకు కడుపులో నొప్పి రాగా తన కొడుకు జగిత్యాల లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చూపించగా డాక్టర్లు ఆమెకు కడుపులో క్యాన్సర్ అని చెప్పగా మెరుగైన వైద్య చికిత్స కోసం కరీంనగర్ లోని చల్మెడ ఆనందరావు హాస్పిటల్ లో చూపించగా ఆమెకు ఆపరేషన్ చేస్తామని డాక్టర్లు చెప్పడంతో ఆపరేషన్ కు భయపడిన వెంకటమ్మ ఇంట్లో ఎవరికి చెప్పకుండా మంగళవారం ఉదయ పూర్వ సమయంలో ,ఇంట్లో నుంచి వెళ్లిపోయి గోవిందుపల్లి గ్రామ శివారులో గల ఓ వ్యవసాయ బావిలో దూకగా ఆమెకు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి ఊపిరాడక మరణించిందని మృతురాలి కొడుకు బింగి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లపల్లి ఎస్ఐ చిర్ర సతీష్ తెలిపారు.

# హెచ్‌సియు విద్యార్థులపై లాఠీఛార్ జ్ దారుణం

### జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావా వసంత

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** పచ్చని అడవిని నాశనం చేయొద్దని నిరసనకు దిగిన హెచ్.సి.యు విద్యార్థులపై లాఠీఛార్జ్ ను ఖండించిన జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావా వసంత. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చని అడవిని నాశనం చేయొద్దని నిరసనకు దిగిన హెచ్.సి.యు విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం చాలా బాధాకరమని ప్రకృతిని, వన్య ప్రాణులను సంరక్షించుకునే బాధ్యత మనందరిపైనే ఉంది అని అన్నారు. రూ.40,000 కోట్ల విలువైన 400 ఎకరాల భూమిని అమ్మి పార్టీ అధిష్ఠానానికి కప్పం కట్టేందుకు చేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నీచమైన ప్రయత్నాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రజానీకం చూస్తూ ఊరుకోదన్నారు. హెచ్.సి.యులో మెషీన్లు అడవిని పెకిలిస్తూ ఉంటే అందులో ఏళ్లతరబడి తమ ఉనికిని కొనసాగిస్తున్న నెమళ్ళు, జింకలు, రకరకాల పక్షులు వాటి సమీపంలో చేరి మా ఉనికిని కాపాడండి అని గట్టిగా అరుస్తూ ఉన్నట్టుగా ఉన్న కొన్ని దృశ్యాలు చూస్తుంటే మనసు చలించిపోతుంది అని అన్నారు. హైదరాబాద్ కు ప్రాణవాయువు అయినటువంటి 400 ఎకరాల హెచ్.సి.యు భూములను అమ్మేసి హైదరాబాద్ ను ఢిల్లీ లాంటి కాలుష్య నగరంగా మారుస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతూ దేశమంతా తిరుగుతున్న రాహుల్ గాంధీ మీకు హెచ్.సి.యు లో మీ కాంగ్రెస్ సర్కార్ బుల్డోజర్లతో చేస్తున్న విధ్వంసం కనపడుత లేదా, విద్యార్థులు, పక్షుల ఆర్త నాదాలు వినపడతలేవా అని ప్రశ్నించారు. 16 నెలల సీఎం రేవంత్ రెడ్డి పాలనలో విధ్వంసం తప్ప అభివృద్ధి లేదు అని జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావా వసంత అన్నారు.

## జీవితంపై విరక్తి చెంది యువతి ఆత్మహత్య

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** కడుపునొప్పి భరించలేక యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది .పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల, కేంద్రానికి చెందిన ఎనగందుల జయంతి (25 ) డిగ్రీ వరకు చదివి ఇంటి వద్దనే ఉంటుంది.ఆమె కొన్ని రోజులుగా కడుపు నొప్పితో ,ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుంది .అట్టి విషయంపై జీవితంపై విరక్తి చెందిన జయంతి ఇంట్లో తన తల్లిలక్ష్మి నిద్రిస్తున్న సమయంలో వంట చేసుకునే రేకుల గదిలో ఇనుప రాడుకు చున్నీతో ఉరి వేసుకొని మరణించిందని,తన మరణంపై ఎవరికి ఎలాంటి అనుమానం లేదని యువతి తల్లి పెనగందులో లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిర్ర సతీష్ తెలిపారు.

## ఇచ్చిన మాటకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని వేముల సుభాష్ అన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తుందని జగిత్యాల జిల్లా బుగ్గరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల సుభాష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా అందించే సన్న బియ్యాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏప్రిల్ 1 నుండి అందించడం గొప్ప విజయమని వేముల సుభాష్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇస్తే తప్పదని ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతుందని అన్నారు. ఇక రాష్ట్రంలో అక్రమ రేషన్ బియ్యం తంతు కనపడదని ప్రతి లబ్ధిదారుడు తనకు వచ్చిన సన్న బియ్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ మహోతర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి సుభాష్ కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/ ముత్తారం :** ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామ శివారులో ఉన్న పెద్ద చెరువుకు ఉన్న రెండు తూముల నుండి గుర్తుతెలియని వ్యక్తులు గేట్లు ఎకు నీటిని కిందికి వదులుతున్నారని రైతులు బుధవారం నాయబ్ తహశీల్దార్ మహమ్మద్ షఫీ రైతులు వినతుపత్రం అందించారు. ఈ సందర్భంగా నీరు వృధాగా వెళ్లితే పోలాలకు నీరు పారడం ఇబ్బందిగా మారే అవకాశం ఉంది ఇలా నీరు వృథాగా పోతున్న సంబందిత చెరువులో చేపలు పెంచే గుత్తేదారుడు ఎందుకు స్పందించడం లేదని దీనిపై విచారణ చేపట్టి మరల పునరావృతం కాకుండ చర్య చేపట్టాలని వినతిపత్రం ద్వారా రైతులు కోరారు. రైతులు శ్రీనివాస్, మర్రి మల్లయ్య,అమ్ము



కుమార్, కొండయ్య,లక్ష్మయ్య, శ్రీనివాస్,వెంకటేష్, ముత్యాల నాదం, కలవేన దేవేందర్,సంతోష్, తంగేళ్ల దేవెందర్,విష్ణు,మల్లయ్య తోపాటు పాల్గొన్నారు.

## కమాన్‌పూర్‌లో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర ప్రారంభం



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** మండలంలోని కమాన్‌పూర్ గ్రామంలో ఎస్సీ కాలనీ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను వారు ప్రారంబించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. గాంధీజీ, అంబేద్కర్ ఆశయాలు రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు. సంవిధాన్ యాత్ర ఇంచార్జి నమిండ్ల శ్రీనివాస్, కొత్తపల్లి మండల కో ఆర్డినేటర్ కర్ర సత్యప్రసన్నారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షుడు సాయిని తిరుపతి, కొత్తపల్లి మండల కాంగ్రెస్ అద్యక్షుడు పంజాల స్వామి గౌడ్, నాయకులు మడుపు మోహన్, రుద్ర మనోహర్, కాంగ్రెస్ కార్యకర్తలున్నారు.

## రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల గడువు 14 వరకు పెంపు

### ఎంపిడిఒ సామ రాంరెడ్డి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు గడువును ప్రభుత్వం ఏప్రిల్ 14 వరకు పొడిగించిందని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా గొల్లపల్లి ఎంపీడీవో రాంరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ ,బిసి ,మైనార్టీ వర్గాలు (ముస్లిం ,క్రిస్టియన్ ,సిక్కు ,బౌద్ధ ,జైన ,పార్సి ) వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత ఇతరులకు ఉపాధి అవకాశాలు ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రకటించిందని అన్నారు .ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరానికి ఆదాయం లక్ష యాభై వేలు ,పట్టణ ప్రాంతాలలో రెండు లక్షలకు మించకుండా ,21 సంవత్సరాల వయసు నుంచి 60 సంవత్సరాలవ యసు వరకు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు ,రేషన్ కార్డు ,రేషన్ కార్డు లేని వారు ఆదాయ ధ్రువీకరణ పత్రం ,తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జారీ చేయబడిన కుల ధ్రువీకరణ పత్రం ,డ్రైవింగ్ లైసెన్స్ ,వ్యవసాయ పథకాల కోసం పట్టాదారు పాస్ బుక్ ,దివ్యాంగులు అయితే సదరం సర్టిఫికెట్ ,పాస్పోర్ట్ సైజు ఫోటో ,దుర్బల (బలహీన)సమూహ ధ్రువీకరణ పత్రం మండల స్థాయి కమిటీ ధృవీకరించబడిన సర్టిఫికెట్ లతో ,మీ సేవ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు .చేసుకున్న దరఖాస్తు పత్రాన్ని డౌన్లోడ్ చేసుకొని అవసరమైన పత్రాలను జత పరచి మండల ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజా పాలన సేవా కేంద్రం లో అందజేయాలని సూచించారు.

## బిసి పోరు గర్జనలో తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్



**ప్రజాపక్షం/ జగిత్యాల-టౌన్:** జంతర్‌మంతర్ వద్ద బిసి సంఘాల ఆధ్వర్యంలో జరిగే బిసిల గర్జనకు తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతిలక్ష్మణ్ హాజరయ్యారు. బిసి బిల్లులను 42శాతం రిజర్వేషన్లు పార్లమెంట్‌లో ఆమోదించి, తొమ్మిది షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, దేవాలయ మంత్రి వర్యులు కొండ సురేఖ, రాష్ట్ర బీసీ నాయకులు జగిత్యాల నాయకులు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి..



ప్రజాపక్షం/తానూర్ :తానూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లు పరిశీలించారు.విద్యార్థులు పరీక్ష రాసిన విధానాన్ని గమనించారు.ఇక్కడ 148 మంది విద్యార్థులకు గాను 100 శాతం హాజరు నమోదు పై హర్షం వ్యక్తం చేశారు.ముఖ్య పర్యవేక్షకులు,శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు.పరీక్ష అనంతరం 10వ తరగతి విద్యార్థులందరికీ ముఖ్యపర్యవేక్షకులు,అక్కడి ప్రధానోపాధ్యాయుల ద్వారా మధ్యాహ్న భోజనం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పి.రామారావు,పర్యవేక్షకులు,శాఖాధికారులు,విద్యాశాఖ సమన్వయకర్త లింబాద్రి,పరీక్షల ఇన్విజిలేటర్లు అందరూ కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.ఈ సందర్భంగా పరీక్షలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి జిల్లా విద్యాధికారి కృతజ్ఞతలు తెలిపారు.

## నిర్మల్ బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం..


ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :నిర్మల్ ఆర్టీసీ బస్ స్టేషన్ లో సత్యసాయి ట్రస్ట్ సౌజన్యంతో వేసవి కాలం ముగిసే వరకు ప్రయాణికుల కొరకు చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు డిపోమేనేజర్ కే.పండరి తెలిపారు.ప్రయాణికులు చల్లని నీటిని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.ప్రయాణికుల కొరకు సేవా దృక్పథంతో సత్యసాయి ట్రస్టు వారు ఈ కార్యక్రమని నిర్వహిస్తున్నందుకు వారిని డిపోమేనేజర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్ ,స్టేషన్ మేనేజర్ ఏ.ఆర్.రెడ్డి కంట్రోలర్లు సత్యసాయి సేవ సమితి సభ్యులు పాల్గొన్నా రు.

## ఫూలాజీ బాబా చూపిన ధ్యానమార్గంలో నడవాలి



ప్రజాపక్షం/కేరమేరి :సద్గురు ఫూలాజీ బాబా చూపిన ధ్యానమార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఆయన తనయుడు కేశవ్ రావు సూచించారు. బుధవారం మండలంలోని కేస్లాగూడ గ్రామంలో నిర్వహించిన ధ్యాన కేంద్రం వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కేశవ్ రావు మాట్లాడుతూ వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. ధ్యానం ద్వారా వ్యక్తిగత జీవనశైలి మెరుగవుతుందని, సమాజంలో సత్సంగం వల్ల మంచి మార్పులు వస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ధ్యాన కేంద్ర కమిటీ సభ్యులు బాగువంత్ రావు, బొడకే శ్యాం రావు, తుకారాం, కొట్నాక విజయ్, సోమాజి, కోవా విజయ్, జానీకరావు, సాకారం, నాగోసే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పేరుకుపోతున్న ధరణి దరఖాస్తులు..!



| [illegible] | [illegible] | [illegible] | Tehsildar | RDO | Additional Collector | Collector |
|---|---|---|---|---|---|---|
| | | Nirmal Division | | | | |
| 1 | Nirmal | Data Correction | 76 | 300 | 59 | 139 |
| 2 | | Succession | 50 | 258 | 0 | 0 |
| 3 | | Pending Mutation | 16 | 25 | 54 | 0 |
| 4 | | Grievance prohibited Property | 8 | 20 | 43 | 8 |
| 5 | | Court Case Intimation | 2 | 22 | 0 | 0 |
| 6 | | Court case PPB | 13 | 1 | 7 | 0 |
| 7 | | Land Matters Grievance | 10 | 11 | 0 | 0 |
| 8 | | Nala WO PPB | 4 | 12 | 0 | 0 |
| 9 | | Khata Merging | 4 | 0 | 0 | 0 |
| 10 | | Application for NRI PPB | 0 | 1 | 0 | 0 |
| 11 | | GPA/Executed GPA | 0 | 0 | 0 | 0 |
| 12 | | Issue of PPB / NALA - Households | 0 | 0 | 0 | 0 |
| 13 | | Organisation PPB | 0 | 0 | 0 | 0 |
| 14 | | Urban Land | 0 | 0 | 0 | 0 |
| | | Nirmal Total | 183 | 651 | 163 | 147 |
| | | Bhainsa Division | | | | |
| 1 | Bhainsa | Data Correction | 68 | 102 | 24 | 91 |
| 2 | | Grievance prohibited Property | 26 | 20 | 48 | 11 |
| 3 | | Succession | 29 | 55 | 0 | 0 |
| 4 | | Pending Mutation | 14 | 6 | 46 | 0 |
| 5 | | Court case PPB | 1 | 12 | 1 | 0 |
| 6 | | Court Case Intimation | 8 | 7 | 0 | 0 |
| 7 | | Land Matters Grievance | 2 | 3 | 0 | 0 |
| 8 | | Nala WO PPB | 1 | 5 | 0 | 0 |
| 9 | | Khata Merging | 1 | 0 | 0 | 0 |
| 10 | | Application for NRI PPB | 0 | 0 | 0 | 0 |
| 11 | | GPA/Executed GPA | 0 | 0 | 0 | 0 |
| 12 | | Organisation PPB | 0 | 0 | 0 | 0 |
| | | Bhainsa Total | 151 | 210 | 119 | 102 |
| | | Grand Total | 334 | 861 | 282 | 249 |

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ధరణి దరఖాస్తులు స్థానిక ఎమ్మార్వో,ఆర్డీవో, కలెక్టరేట్ కార్యాలయాలలో పేరుకు పోతున్నా యి.వివిధ కారణా లతో వ్యవసాయ రైతులు తమ భూములను అమ్మడం ,కొనడం, వారసత్వం మార్పులకు ఆయా మండల కార్యా లయాలలో దరఖాస్తు చేసుకుంటారు.కాగా దరఖాస్తు చే సుకుని నెలలు గడుస్తున్న ఎక్కడి దరఖాస్తులు అక్కడే పెండింగ్లో ఉండటంతో రైతులు ఇబ్బందులకు గురవుతు న్నారు.దీంతో ఆయా కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా ప్రదక్షణలు చేస్తున్నారు.కానీ పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

**పేరుకుపోతున్న ధరణి దరఖాస్తులు..**

జిల్లా వ్యాప్తంగా రైతులు వివిధ ధరణి దరఖాస్తులు పేరుకు పోతున్నాయి.అయినప్పటికీ సంబంధిత అధికారులు వాటిని పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు.దీంతో రైతులు,దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు.దరఖాస్తులు పెండింగ్ ఉండటంతో తమ పనులు చేసుకోవడంతో ఇబ్బందుల పాలవుతున్నారు.నిర్మల్ జిల్లా నిర్మల్ నియోజకవర్గం పరిధిలో స్థానిక తహసిల్దార్ కార్యాలయాలలో 183 దరఖాస్తులు,ఆర్డిఓ కార్యా లయ ంలో 651 దరఖాస్తులు,అదనపు కలెక్టర్ వద్ద 163,కలెక్టర్ కార్యాలయంలో 147 మొత్తం 1144 దరఖాస్తులు పెం డింగ్ లో ఉన్నాయి.ఇక బైంసా డివిజన్ లో తహసిల్దార్ కార్యాలయాలలో 151,ఆర్డీవో కార్యాలయంలో 210,అదన పు కలెక్టర్ వద్ద 119,కలెక్టర్ వద్ద 102 మొత్తం 582 దర ఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయి .ముఖ్యంగా వారసత్వ బదలా యింపు భూములకు సంబంధించి దరఖాస్తులు ఎ క్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

**ఇబ్బందులు పడుతున్న రైతులు...**

ఆయా విషయాలలో రైతులు తమ పేరిట దరఖాస్తు చేసు కున్న భూములకు సంబంధించి పెండింగ్ లో ఉండటంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.భూములను కొనుగోలు చేసిన రైతులు,వారసత్వం బదిలాయింపు చేసిన రైతులు తమ పేరిట భూములు బదలాయింపు కాకపోవడ ంతో వారు వేసిన పంటలను ఎవరి పేరిట వ్యవసాయ శాఖ కార్యాలయాలను రాయించాలో తెలియక తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు.ఒక వేళ పంట వివరాలను నమోదు చేయించకపోతే పంటలను అమ్ముకునేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పంట రుణాలను పొందేది ఎలా..**

దరఖాస్తుదారులు తమ భూముల పట్టాలు తమ పేరిట కాకపోవడంతో పంటలు వేసేందుకు రుణాలు పొం దటానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పట్టా పాస్ బుక్ తమ పేరిట వస్తే రుణా లను పొంది పంటలు సాగు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని,ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో రుణా లు పొందేందుకు అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు.ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పెండింగ్ ధరణి దరఖాస్తులను పూర్తిచేయాలని కోరుతున్నారు.

## సన్నబియ్యం పంపిణీ

ప్రజాపక్షం / మాక్లూర్ :మాక్లూర్ మండల భారతీయ జనతా పార్టీ నాయకులు వేణు కిషన్ నగర్ గ్రామ పరిధిలో రేషన్ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సన్నబియ్యం ప్రక్రియ సాఫీగా సాగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేపట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సన్నబియ్యం పంపిణీ ఎంతో ఆనందదాయకం అని కేంద్ర ప్రభుత్వం పంపిణీ కార్యక్రమం నిర్వహించడం చాలా అదృష్టంగా భావిస్తున్నామని మండల అధ్యక్షులు మమత అన్నారు. ప్రధానమంత్రి పేద ప్రజలకు సన్నబియ్యాన్ని అందిస్తున్నారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం తామే ఇస్తున్నామని డబ్బాలు కొట్టుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు అత్త సొమ్ము అల్లుడు దానం అన్నట్టుగా ఉంది. కాంగ్రెస్ పార్టీ తీరు పేద ప్రజలకు చేసిందేమి లేదు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు నిజమైన పేదలకు అందకుండా అందని ద్రాక్ష లాగా మిగిలిపోతుందని వారన్నారు. నిరుపేద ప్రజలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా జాప్యం వహిస్తు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తక్షణమే మండల వ్యాప్తంగా నిరుపేదలకు రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని వారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు గంగోని మదారి మమత, రాజేశ్వర్, మండల బిజెవైఎం అధ్యక్షులు రాజశేఖర్, భూత్ అధ్యక్షులు మారుతి, కార్యకర్తలు తదితరులున్నారు.

## ప్రతీ ఉద్యోగి సేవలు అభినందనీయం:నుడా చైర్మన్ కేశ వేణు

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :నగరపాలక సంస్థలో పనిచేసి పదవీ విరమణ చేస్తున్న అధికారుల సేవలు అభినందనీయమని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ కేశ వేణు అన్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ గంగిశెట్టి రాజేందర్ కుమార్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, డిప్యూటీ సిటీ ప్లానర్ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పాలకుర్తి శ్యాంకుమార్‌ల పదవీ విరమణ కార్యక్రమంలో ఆయనముఖ్యఅతిథిగా హాజరై ఉద్యోగుల పనితీరును కొనియాడారు. ఉద్యోగంలో పదవి విరమణ అనేది సహజమని ప్రభుత్వానికి ప్రజలకు వారు చేసిన సేవలు అమోఘమన్నారు. నగరపలక సంస్థలో అంచెలంచెలుగా ఎదుగుతూ ఉన్నత స్థాయి అధికారిగా పదవి విరమణ పొందటం గర్వకారణమని మున్సిపల్ కమీషనర్ దిలీప్‌కుమార్ అన్నారు. విధి నిర్వహణలో వారు అందించిన సేవలు చిరస్మరణీయంగా మిగిలిపోతాయన్నారు. ఈ సందర్భంగా వారిని శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అధికారుల కుటుంబ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం :డిసిసి అధ్యక్షుడు శ్రీహరిరావు..

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని డిసిసి అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు.నిర్మల్ రూరల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామంలో,లక్ష్మ ణచందా మండలంలోని తిరపెల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు,జైభీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి బాపూజీ చిత్రపటానికి,అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.రాజ్యాంగాన్ని రక్షించుకుందామని గ్రామ ప్రజలు ప్రతిజ్ఞ చేశారు.అనంతరం గ్రామంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కరపత్రాలను పంపిణీ చేశారు.రాజ్యాంగ పీఠిక ప్రదర్శన చేపట్టారు.రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుంట వేణుగోపాల్,ఓడ్నాల రాజేశ్వర్,నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమ్ రెడ్డి,కార్యక్రమ మండల ఇంచార్జ్ నాయకుడు,తదితరులు పాల్గొన్నా రు

## దండోరా ద్వారా ప్రత్యక్ష భాగస్వామ్యానికి ప్రోత్సాహం

### బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

ప్రజాపక్షం/బోధన్:రాజీవ్ గాంధీ యువ వికాసం స్కీం లో భాగంగా గ్రామాలలో యువ వికాసం పథకం గురించి దండోరా వేయించడం ద్వారా యువతకు ఈ పథకంలో ప్రత్యక్ష భాగస్వామ్యానికి ప్రొత్సహం అందించిన వాళ్లవుతారని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. బుధవారం వర్ని మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను జత పరిచే పురోగతిని సమీక్షించారు. గృహ నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు నిధుల విడతల వారిగా లభిస్తాయని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఖాళీగా ఉన్న వారికి సన్న బియ్యం అందిస్తుందని, ఈ అవకాశాన్ని రేషన్ కార్డు లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు వర్ని తహసీల్దార్ సాయిలు, రేషన్ డీలర్ల అధ్యక్షుడు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా విద్యాశాఖాధికారి



ప్రజాపక్షం/తానూరు :తానూర్ మండలంలోని బోసి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు సందర్శించారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ చివరి పరీక్ష అయిన సాంఘిక శాస్త్ర విషయ పరీక్ష నిర్వహించడం జరిగింది.దీనితో జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ఎలాంటి పొరపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు.ఇందుకు సహకరించిన అందరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు,కృతజ్ఞతలు తెలిపారు.బుధవారం రోజు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సాంఘిక శాస్త్ర విషయ పరీక్షలో రెగ్యులర్ విద్యార్థులు 9129 కు గాను 9117 మంది హాజరయ్యారని,12 మంది గైర్హాజరు అయ్యారని ఆయన తెలిపారు.కేంద్రాలలో గదులన్నీ తిరిగి అక్కడి సిఎస్,డిఓలకు పలు సూచనలు చేశారు.కాపీయింగ్ జరుగకుండా అందరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు.పోలీస్ స్టేషన్ నుండి సరియైన సెట్ ప్రశ్నాపత్రాలను తీసుకోవాలని,అదేవిధంగా జాగ్రత్తగా జవాబు పత్రాలను పోస్ట్ ఆఫీస్ లో సరియైన విధంగా పోస్ట్ చేయాలని సూచించారు.ప్రశాంతంగా పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి నివ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సమన్వయ కర్త లింబాద్రి,ముఖ్య పర్యవేక్షకులు,శాఖాధికారి పాల్గొన్నారు.

## భార్య, అత్తను కొట్టిన వ్యక్తి అరెస్ట్




ప్రజాపక్షం/ తాండూర్ :తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్య, అత్తను గాయపరిచిన కేసులో దాగం మల్లేష్ (38) అనే వ్యక్తిని అరె స్ట్ చేశారని తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలు బుధవారం ఎస్ఐ మీడియాకు వెల్లడించారు. మార్చి 16 సాయంత్రం అచ్చులాపూర్ గ్రామపంచాయతీ, కొమ్ముగూడెం గ్రామంలో మద్యం మత్తులో ఇంట్లో గొడవ పడుతున్న మల్లేష్‌ను అడ్డుకున్న భార్య లావణ్య, అత్త రాజును కబ్గిరి గరిటతో దాగం మల్లేష్ తలపై బలంగా కొట్టి గాయపరిచాడని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మల్లేష్‌ను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్ఐ కిరణ్ కుమార్ వెల్లడించారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని, రౌడీల్లా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే రౌడీ షీట్ ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## సాయి కృష్ణ కుటుంబాన్ని పరామర్శించిన ఎంఎల్‌సి బాల్మూర్ వెంకట్



ప్రజాపక్షం/ మందమర్రి :ఎంఎల్‌సి బాల్మూర్ వెంకట్ పిఏ సాయి కృష్ణ తల్లి ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందడంతో బుధవారం సాయి కృష్ణ ఇంటికి వెళ్లి ఎంఎల్‌సి బాల్మూర్ వెంకట్ సాయి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా బాల్మూర్ వెంకట్ సాయి కృష్ణ, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి, తల్లి కోల్పోవడం తీరని లోటు అని, కుటుంబం ధైర్యంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగతంగా ఆయన కుటుంబానికి అండగా ఉంటానని భ రోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి సాయి కృష్ణ తల్లికి నివాళులర్పించిన ఎంఎల్‌సి ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించా రు.

## మార్కెట్‌కమిటీ ఇన్‌చార్జి ఛైర్మన్‌గా చీల శంకర్



**ప్రజాపక్షం/బోధన్:**బోధన్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్‌ఛార్జి గా చీల శంకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు చైర్ పర్సన్‌గా ఉన్న అంకు సంధ్య దాము కు టీచర్ ఉద్యోగం రావడంతో ఛైర్ పర్సన్ పదవికి ఆమె రాజీనామా చేశారు. వైస్ ఛైర్మన్ గా వ్యవహరిస్తున్న చీల శంకర్ ను ఇన్‌ఛార్జి ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగిస్తూ మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో చీల శంకర్ మార్కెట్ కమిటీ ఇన్‌ఛార్జి ఛైర్మన్ గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించినందుకు మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ ఆవరణలో హమాలీ కూలీల కొరకు ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిసిసిడెలిగేట్ గంగా శంకర్, నాయకులు మార్కెట్ కమిటీ సిబ్బంది, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

## మోర్తాడ్ మండలంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర

**ప్రజాపక్షం/మోర్తాడ్;**నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండల కేంద్రంతో పాటు మండలంలోని దొన్కల్, ధర్మోర, శెట్పల్లి గ్రామాల్లో బుధవారం రోజు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ మండల ఇన్‌ఛార్జి డిసిపి ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి, మోర్తాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములు, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనిల్ రెడ్డి, డోన్కల్ రంజిత్, శెట్పల్లి దేవేందర్, ధర్మోరా ఎన్‌డిసిసిబి డైరెక్టర్ మోత్కు భూమన్న, సంజీవ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ మహిపాల్, దేవేందర్, ఆనంద్, గంగా నరసయ్య, యువజన అధ్యక్షులు, మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాలను ప్రారంభించిన ఎసిపి



**ప్రజాపక్షం/నందిపేట్:** నందిపేట్ మండలంలోని లక్కంపల్లి గ్రామంలో 16 సిసి కెమెరాలను గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్నారు. బుదవారం ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ గ్రామాన్ని అన్ని గ్రామాల ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వీటివల్ల దొంగల, పోకిరిల ఇబ్బందులు దూరం అవుతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలి : కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :**యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆమె యాసంగి వరి కొనుగోలు ప్రక్రియ నిర్వహణపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.త్వరితగతిన కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల నిర్వహకులు సిబ్బందికి శిక్షణను ఇవ్వాలని,కొ నుగోలు కేంద్రాలలో సరిపడినన్ని తూకపు యంత్రా లు, తేమ యంత్రాలు,గన్ని సంచులు అందుబాటులో ఉం చాలన్నారు.అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లను అందుబాటులలో ఉంచుకోవాలన్నారు.సరిపడినంతమంది హమాలీలు,లారీలను సమకూర్చుకోవాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు ,టెంట్,ధాన్యం మద్దతు ధర తెలిపే బోర్డులు,కంట్రోల్ రూమ్ నెంబర్,కొనుగోలు కేంద్రానికి సంబంధించిన ఏజెన్సీ ఫోన్ నంబర్ లను ప్రదర్శించాలన్నారు.ధాన్యం తూకం జరిగిన 24 గంటల లోపు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.కొనుగోలు కేంద్రాలకు సంబంధించి అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు.ప్యాడి క్లీనింగ్ యంత్రాల ద్వారా రైతులు తమ వరి ధాన్యాన్ని శుభ్రపరిచి తూకం వేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన నాటి నుంచి రోజువారీగా ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వివరాల నివేధికలను అందజేయాలన్నారు.రైస్ మిల్లర్లు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్,ఆర్డీఓ రత్నకళ్యాణి,జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్,పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుధాకర్,ఇన్ చార్జి డీఆర్డిఓ ,ఇన్ చార్జి ఏడి మార్కెటింగ్ గజానంద్,జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ,డీసీఓ కార్యాలయ అధికారి ,రైస్ మిల్లర్లు,లారీ ట్రాన్స్ పోర్ట్ ప్రతినిధులు,ఇతర అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ కలెక్టరెట్‌ను ముట్టడించిన ఐకెపి విఓఎ లు..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**జిల్లా కమిటీ పిలుపుమేరకు విఓఎల సమస్యలపైబుధవారం రోజు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి రాష్ట్ర జెఎసి ఆధ్వర్యంలో ఈ ధర్నా కార్యక్రమానికి 500 మంది వివోఏలు పాల్గొనడం జరిగిందని అన్నారు.కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా వివోఎల జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ వివోఏలకు పనికి తగిన వేతనం చెల్లించాలని,ఉద్యోగ భద్రత కల్పించి,రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.రెండు గంటలపాటు కలెక్టరేట్ ముట్టడిలో ఉద్దికత పరిస్థితి ఏర్పడ్డ శాంతియుతంగానే నిర్వహించారు.పిడి వివోఏల సమక్షంలో మాట్లాడుతూ మీయొక్క డిమాండ్లను కలెక్టర్‌ఖ ఆఫీస్ ద్వారా సర్ఫ్ సీఈఓ కు సిఎంఓ ద్వారా సీఎం కు సమాచారాన్ని అందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు.సమస్యలు పరిష్కరించకుంటే త్వరలోనే రాష్ట్రస్థాయిల అన్ని జిల్లాల కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిస్తామని జేఏసీ చెప్పడం జరిగిందని అన్నారు.శ్రీనిధి ఇన్సెంటును వెంటనే చెల్లించాలి.శ్రీనిధి నుండి గౌరవ వేతనాలు 10000 చెల్లించాలి,అర్హులైన వివోఏ లను శ్రీనిధి మేనేజర్లుగా సీసీ లుగా తీసుకోవాలి.వివో ఎలా గౌరవ వేతనాన్ని పనికి తగ్గ వేతనం 26,000 కేటాయించాలి.టాబు నెట్వర్క్ సౌకర్యం కల్పించాలి.అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్,భోజన్న ,స్వప్న, సంగీత, సంపత్,రజిత,సునీత,లావణ్య,రాజు,విక్రం అనిల్,రాష్ట్ర కమిటీ నాయకులు,శరత్ కుమార్‌తదితరులు పాల్గొన్నారు.

## లోడ్‌పల్లిలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం లోడ్‌పల్లి గ్రామంలోని షాఫ్ నంబర్ 2416008 వద్ద సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రాయితీ పై సన్న బియ్యం పంపిణీ గ్రామస్థుల ఆహార భద్రతను మెరుగుపరిచే కీలకమైన అడుగు అని, పేద ప్రజలకు పోషకాహారంతో కూడిన నాణ్యమైన బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు కట్టుబడి ఉందని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ఉద్దేశమని పేర్కొన్నారు. ఎంఆర్‌ఓ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీ పథకం ద్వారా గ్రామ ప్రజలకు అధిక పోషక విలువలున్న బియ్యం అందుతుందని, ఇది వారి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేలా సహాయపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ కొమురయ్య, పంచాయితీ కార్యదర్శి , రేషన్ డీలర్ బా పురావు, గ్రామపెద్దలు,లబ్ధిదారులు పాల్గొన్నారు. స్థానికు లు ఈ పథకాన్ని ప్రశంసిస్తూ, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపా రు

## విద్యార్థులపై పోలీసు నిర్బంధాన్ని ఎత్తివేయాలి

### సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) డిమాండ్



**ప్రజాపక్షం /నిజామాబాద్ అర్బన్ :**హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల నుండి తక్షణమే బుల్డోజర్లను వెనక్కి పిలిపించాలని, విద్యార్థులపై పోలీసు నిర్బంధాన్ని ఎత్తివేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నగర కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. బుదవారం సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నిజామాబాద్ నగర కమిటి ఆద్వర్యంలో అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాలుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటి పరిధిలో అనేక రకాల వృక్షాలకు జంతువులకు పర్యావరణానికి నిలయంగా ఉన్న భూముల్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించడం సరైంది కాదన్నారు. పండగ పూట సెలవురోజు, అర్ధరాత్రి సమయంలో బుల్డోజర్లతో పర్యావరణ విధ్వంసానికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. ఈ విధ్వంస కాండను నిరసించిన విద్యార్థులపై లాఠీచార్జి చేస్తు అక్రమ కేసులు పెట్టి, జైలుకు పంపడం అన్యాయమన్నారు. ప్రజాస్వామ్య బద్దంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులపై పోలీసు లాఠీచార్జిని ఖండిస్తున్నామన్నారు. ఒకవైపు బిజెపి పాలిత రాష్ట్రాల్లో బుల్డోజర్ సంస్కృతిని వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ పార్టీ, తాను అధికారంలో ఉన్న రాష్ట్రంలో అదే బుల్డోజర్ పద్ధతులను పాటించడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరిని తెలియజేస్తుందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బేషజాలకు పోకుండా, హెచ్‌సియు విద్యార్థులతో, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలతో చర్చలు జరిపి తగు పరిష్కారం రూపొందించాలన్నారు. తక్షణమే చెట్ల తొలగింపు ప్రక్రియను ఆపేసి, విద్యార్తులపై నిర్బందాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిచో విద్యార్థులు, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గణేష్, పివైఎల్ ఉపాధ్యక్షుడు సాయిబాబా, టియుసిఐ జిల్లా నాయకుడు రవి తదితరులు పాల్గొన్నారు.

## సిద్దాపూర్, వన్నెల్ గ్రామాలలో కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర



**ప్రజాపక్షం /నందిపేట్ :**నందిపేట్ మండలంలోని సిద్దాపూర్, వన్నెల్ .కె. గ్రామాలలో బుధవారం ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి ఆదేశాల మేరకు జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేశారు. గాంధీ, అంబేద్కర్ లాంటి మహనీయుల గురించి అసత్య ప్రచారం చేస్తున్న పార్టీల మాటలు తిప్పి కొట్టాలని డిసిసిబి ఛైర్మన్ కుంట రమేష్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంద మహిపాల్, దేవిదాస్ గౌడ్, లోక హన్మాండ్లు, కిష్టగౌడ్, లింగం, లక్ష్మి నారాయణ, సాగర్, సాయారెడ్డి, వెంకటేశ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీ భూములను కాపాడాలని ఎఒకు వినతి

**ప్రజాపక్షం / బాన్సువాడ:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలని కోరుతు బుధవారం బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారిణి సువర్ణకు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మోచి గణేష్ మాట్లాడుతూ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాద్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గౌస్, శివసూరి, గాండ్ల కృష్ణ, అనిల్ జీవన్, సంజయ్ యాదవ్, శంకర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం / బాన్సువాడ:** బాన్సువాడ మండలంలోని హన్మాజిపేట్, కోనాపూర్, సంగోజిపేట్ గ్రామాల్లో బుధవారం మార్కెట్ కమిటి ఛైర్మన్ మంత్రి అంజవ్వ గణేష్, స్తానిక నాయకులతో కలిసి ప్రభుత్వం ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా అందజేస్తున్న బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యాన్ని అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోనాల సుభాష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భానుగౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్, వెంకగౌడ్, సంజీవులు, బోనాల సాయిలు, వెంకటరెడ్డి, గాండ్ల సాయిలు, నవీన్ రెడ్డి, అక్తర్, గంగారాం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిని దిగ్బందిస్తాం..



**ప్రజాపక్షం/నేరడిగొండ :**గత వారం క్రితం ఆక్రమంగా గోపులను పశువులను కబేలాలకు తరలిస్తున్న వాహనాలను హిందు సంఘాలు టోల్ ప్లాజా వద్ద అడ్డుకోవడంతో చిలికి చిలికి గాలి వానలా రాద్ధాంతంగ చేస్తున్నారని స్థానిక ఎస్సై సీఐలు సమస్యను జఠిలం చేస్తున్నారే తప్ప పరిష్కార మార్గాలు చూపెట్టడం లేదని బిజెపి జిల్లా అధ్యోక్షుడు పతంగి బ్రహ్మానంద్ ,బుధవారం నేరడిగొండ పెద్ద హనుమాన్ ఆలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ అన్నారు.హిందూ యువకులపై అక్రమంగా కేసులు బనాయించి ఆక్రమ వాహనాలను విడిచి పెట్టడంలో ఆంతర్యమేంటో పోలీసులే వివరణ ఇవ్వాలని లేనియెడల హిందూ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జాతీయ రహదారిని దిబ్బందిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని హిందూ సంఘాల నాయకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం



**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :**సిఎం రిలీఫ్ ఫండ్ నురుపేదలకు వరమని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా మాజీ ఇంచార్జి జడ్‌పి చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. కాగజ్‌నగర్ మండలం బురదగూడ గ్రామానికి చెందిన కొట్రంగి హన్మంతు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. మాజీ ఎంఎల్‌ఎ కోనేరు కోనప్ప సిఫార్సు మేరకు మంజూరైన రూ. 58.500 చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఇంటికొచ్చిన వారికి ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక సాయం ఎంతగానో వారి కుటుంబానికి భరోసాగా నిలుస్తుందని అనాన్నరు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యుడు సిద్దిక్, నాయకులు కట్ట ప్రసాద్, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :**కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చింతగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి కుమ్మరి హరీష్ అన్నారు. బుధవారం గ్రామ పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, వేసవి ముగిసే వరకు చలివేంద్రం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జుమిడి పోచయ్య, శంకర్, గుర్లె మెంగాజీ, లెండుగురె వెంకటేష్, గౌత్రే శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## రామాలయంలో స్వచ్ఛ మందిరం, పరిశుభ్ర ప్రాంగణం కార్యక్రమం



**ప్రజాపక్షం/ఎడపల్లి:**స్వచ్ఛ మందిరం పరిశుభ్ర ప్రాంగణం కార్యక్రమంలో భాగంగా ఇందూరు దేవాలయాల పరిశుభ్రత కమిటీ ఆధ్వర్యంలో ఎన్సీఎస్ఎఫ్ శ్రీ కోదండ రామాలయంలో బుధవారం పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. సుమారు 50మంది కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేసి చెత్తచెదారాన్ని తొలగించారు. ప్రతి బుధవారం జిల్లాలోని ఒక ఆలయాన్ని ఎంచుకొని శుభ్రం చేసే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇలాంటి కార్యక్రమంలో హిందూ బంధువులందరూ పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

## నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీతో ఎంతో మేలు : కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:**నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యంతో ఎంతో మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని రెబ్బెన మండలం కేంద్రంలోని చౌక ధరల దుకాణంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, ఇతర అధికారులతో కలిసి రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులైన రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని, ప్రజాసంక్షేమంలో భాగంగా పేదవారి కడుపు నింపేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలోని 314 పౌరసరఫరాల దుకాణాల ద్వారా ప్రతి రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్నబియ్యాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో అన్ని చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యాన్ని అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని, గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో పంపిణీకి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, పేర్ల తొలగింపులు, చేర్పులు చేసుకోవచ్చని, బియ్యం పంపిణీ సమయంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ అర్హులైన పేదవారి కడుపు నింపేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి పండుగ వాతావరణంలో అర్హులైన అందరికీ అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన రేషన్ కార్డుదారులకు కుటుంబంలోని ప్రతి సభ్యుడికి 6 కిలోల చొప్పున సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తుందనితెలిపారు. సన్న బియ్యం పంపిణీ సక్రమంగా నిర్వహిస్తూ కార్డుదారులకు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, రెబ్బెన మండల తహసిల్దార్ , సంబంధిత అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోరాట గడ్డ నుంచి కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

**ప్రజాపక్షం/ కేరమేరి :**కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర బుధవారం కేరమేరి మండలంలోని జోడేఘాట్ నుంచి ప్రారంభమైంది. కొమురం భీం పోరాటం జరిగిన ప్రదేశం నుండి యాత్ర ప్రారంభం కా వడంతో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎంఎల్‌ఎ ఆత్రం సక్కు పాల్గొని మాట్లాడుతూ మహాత్మా గాంధీ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి 100 సంవత్సరాలు, అలాగే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రా జ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో ఈ యాత్రను చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ంలో అధికారంలో ఉన్న బిజెపి రాజ్యాంగాన్ని మార్చాల ని ప్రయత్నిస్తున్నదని, నిండు పార్లమెంటులో కేంద్ర హోం మంత్రి డాక్టర్ అంబేద్కర్‌ను అవమానపరిచారని వి మర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మహాత్మా గాంధీ, అంబేద్కర్ అడుగుజాడల్లోనే నడుస్తుందని, ప్రజలను రా జ్యాంగంపై చైతన్యవంతం చేయడమే ఈ యాత్ర లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని వివిధ స మస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండి మునీర్ అహ్మద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుసుం రావు, కోఆర్డినేటర్ చునర్కర్ వసంత్ రావు, మాజీ సర్పంచులు న్యానేశ్, జలపాతి, నాయకులు ఖుద్బొద్దిన్, కోవా ఇంద్రా, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపుల తనిఖీ



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :**జిల్లా కేంద్రంలోని చంద్రశేఖర్ కాలనీలోని పలు రేషన్ దుకాణాలను అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీని ప్రారంభించిన నేపథ్యంలో లబ్ధిదారులకు సజావుగా బియ్యం పంపిణీ చేస్తున్నారా లేదా అని పరిశీలన జరిపారు. 23, 31 నెంబర్ రేషన్ షాపులను సందర్శించి బియ్యం పంపిణీ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలలోని సభ్యుల సంఖ్యకనుగుణంగా బియ్యం నిల్వలు కేటాయించబడ్డాయా అని ఆరా తీశారు. ఎలాంటి అవాంతరాలు తావు లేకుండా సజావుగా బియ్యం పంపిణీ జరిగేలా చూడాలని డీలర్లు సంధ్యారాణి, గంగామణిలను ఆదేశించారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/నస్పూర్:**ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్లో గల పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ అనారోగ్య సమస్యలపై ఆసుపత్రులకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, వేసవికాలం అయినందున వడదెబ్బ నుండి కాపాడుకునేందుకు పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 1 ర్యాంకర్‌ను అభినందించిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :**గ్రూప్ 1 పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన మంథని కి చెందిన విద్యార్థిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో తన ఛాంబర్ లో తనను కలిసిన గ్రూప్ 1 అభ్యర్థి జక్కుల అరుణ కుమార్ ను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ 1 పోటీ పరీక్షల్లో మంథని మండలం ఖాన్ సాయి పేట గ్రామానికి చెందిన జక్కుల అరుణ కుమార్ రాష్ట్రస్థాయిలో 114వ ర్యాంకు, మల్టి జోనల్ 1 స్థాయిలో 64వ ర్యాంకు సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంతోషం వ్యక్తం చేస్తూ సంబంధిత విద్యార్థిని, అతని తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్, తల్లిదండ్రులు మల్లేశ్వరి , లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని హరిపురం గ్రామపంచాయతీ ఆవరణంలో కరీంనగర్ సన్ రైజ్ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు హరిపురం మాజీ సర్పంచ్ వేల్పూరి సంపత్ రావు తెలిపారు.బుధవారం హరిపురం గ్రామంలోని బస్టాండ్ ఆవరణంలో గ్రామస్తులతో కలిసి ఉచిత వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు.ఈ వైద్య శిబిరానికి సన్ రైజ్ ఆస్పత్రి ప్రముఖ వైద్యులు హాజరై పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఎల్ఆర్ఎస్, ఆస్తిపన్ను చెల్లింపులకు 30 వరకు గడువు పెంచిన ప్రభుత్వం

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :**నగరపాలక, నగర అభివృద్ధి సంస్థ (డిటిసిపి) తెలంగాణ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ 2020 రెగ్యులేషన్ విషయమై దరఖాస్తుదారులకు గడువును ఈనెల 30 వరకు పెంచుతు ఉత్తర్వులు జారీచేసింది. (ఏప్రిల్ 30 వరకు 2025) 25 శాతం తగ్గింపులో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించుటకు తెలంగాణ ప్రజలకు బుదవారం జీవోనెంబరు 182 ద్వారా అవకాశం కల్పించింది. అంతేకాకుండా ఆస్తిపన్ను చెల్లింపులో సైతం 202526 సంవత్సరానికి గాను బకాయిలు, వార్షిక ఆస్తి పన్నుల చెల్లింపులలో ఐదు శాతం తగ్గింపును ఏప్రిల్ 30 వరకు గడువును పెంచుతు ఉత్తర్వులు జారీచేసింది. ఇట్టి ఉత్తర్వులు తక్షణమే అమలులో ఉంటాయని ఆ ఉత్తర్వుల ద్వారా తెలియజేసింది. కావున నగర ప్రజలకు ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని నగర కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## రజతోత్సవ మహాసభలో పాల్గొన్న నిజామాబాద్ జిల్లా నాయకులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :**ఈనెల 27న వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్న రజతోత్సవ సభ సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో ఎర్రవల్లి నివాసంలో బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ సన్నాహాక సమావేశానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నేతలు, మాజీ మంత్రి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గణేష్ బిగాల, బాజిరెడ్డి గోవర్దన్, గంప గోవర్ధన్, జాజులసురేందర్, హనుమంత్ షిండే, కామారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు ముజీబుద్దీన్, అయేషా షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన పదవ తరగతి పరీక్షలు

**ప్రజాపక్షం/ఎడపల్లి:**గత 12రోజుల క్రితం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో మూడు పరీక్షా కేంద్రాల్లో గత నెల 21న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మొదటి రోజు నుంచి ప్రశాంతంగా కొనసాగాయి. పది పరీక్షలు బుధవారం ముగియడంతో ఉత్సాహంతో విద్యార్థులు తాము ఈ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలతో పాటు జాన్కంపేట్ గ్రామంలో గల ఒక పరీక్ష కేంద్రంలో 380 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 377మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష మొదటి రోజు బయపడిన చివరి పరీక్షలు బాగానే రాశామని,, బుధవారం సాంఘిక శాస్త్రం చివరి పరీక్ష కావడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ తాము రాసిన పరీక్షల్లో ప్రతి సబ్జెక్టులో ఉత్తమ మార్కులు సాధించి మంచి గ్రేడును పొందుతామని ధీమా వ్యక్తం చేశారు.

## బిఆర్ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బియ్యని రాజు ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న రాజును మంథని మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధు బుధవారం పరామర్శించారు. సందర్భంగా రాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సింగిల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ ఎంపిపి అత్తె చంద్రమౌళి, మాజీ వైస్ ఎంపిపి సూదాటి రవీందర్ రావు, తోపాటు టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## ఉద్యోగ విరమణ మహోత్సవంలో పాల్గొన్న విద్యాశాఖాధికారి

**ప్రజాపక్షం/బాన్సువాడ:**బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలోని ఎంపిపిఎస్ ప్రాథమిక పాఠశాలలో ప్రదానోపాధ్యాయుడిగా విదులు నిర్వహించిన మాసాని సంతోష్ రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్‌రావు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని, విశ్రాంత జీవితంలో కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూనేకర్ సంతోష్, రామకృష్ణ, సంతోష్, శ్రీకాంత్‌రెడ్డి, రంగమ్మ, శ్రీలత, కుటుంబ సభ్యులు విక్రమ్, శ్రావణి, విక్రాంతి, శ్రీనాథ్ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :**బహుజన రాజ్యాధికార పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, అధికారులు, గౌడ సంఘం నాయకులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘాల నాయకులతో హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పాపాన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బహుజనుల కొరకు రాజ్యాధికార పోరాటాలు చేసిన యోధుడు, మొగలాయిల దౌర్జన్యాలకు, జమీందారులకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడని అన్నారు. బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, ఇలాంటి మహనీయుల చరిత్రను భావితరాలకు అందించేందుకు అందరం సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సజీవన్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, గౌడ సంఘం నాయకులు బాలేష్ గౌడ్, సుదర్శన్ గౌడ్, మహిళ సంఘ అధ్యక్షురాలు అన్నపూర్ణ, వెనుకబడిన తరగతుల కులాల ప్రతినిధులు, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి:ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్:**ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు సుర్జాపూర్ గ్రామంలోని చౌకధరల దుకాణంలో లబ్ధిదారులకు ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ,నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు,గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో సన్నబియ్యం పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టంచేస్తూ,ప్రతీ పథకాన్ని లబ్ధిదారులకు చేరవేయడం తమ బాధ్యతగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు,స్థానిక నాయకులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని వీరులకు ఘనంగా సన్మానం..

**ప్రజాపక్షం/కుంటాల :**కుంటాల మండల కేంద్రానికి చెందిన ఆరిగెల అరుణ్,ప్యాదరి శ్రీనివాస్ లు ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన అగ్ని వీర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికయ్యారు.స్థానిక వీరాంజనేయ స్వామి ఆలయంలో అంజన్న స్వాముల ఆధ్వర్యంలో బుధవారం వారిని ఘనంగా సన్మానించారు.గురు స్వాములు భుజంగం గణపతి,ఓడ్నం కృష్ణ,రమేష్,రాజ్ కుమార్,నవీన్,సంజీవ్,రాజేశ్వర్,వంశి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉపాధ్యక్షుడి నియామకం..

**ప్రజాపక్షం/నేరడిగొండ :**అదిలాబాద్ జిల్లా ఎన్ హెచ్ ఆర్ సి నేషనల్ హుమెన్ రైట్స్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షునిగా రాథోడ్ సందీప్ కుమార్ ని నియమించారని జిల్లా అధ్యక్షుడు జితేందర్ రాథోడ్ తెలిపారు.ఈ సందర్భంగా సందీప్ కుమార్ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు నా వంతు అవకాశంగా భావిస్తానని ఈ అవకాశాన్ని ప్రజాసేవకై నిరంతరం పాటు పడతానని అన్నారు.నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని అన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న 315వ వర్ధంతి

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తి అందరికి అనుసరణీయమన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌ని పాపన్నగౌడ్ విగ్రహానికి తాహెర్‌బిన్ హందాన్, అంకిత్ పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. పోరాట యోధుడు పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను అధికారికంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో స్రవంతి, నర్సయ్య, గంగాధర్, శ్రీనివాస్, సత్యనారాయణ, మారయ్య, లక్ష్మణ్, రత్నాకర్, రాజా, సుమన్, నాగరాజు, సాయ, ఉమాశ్రీనివాస్ గీతా వృత్తిదారులు పాల్గొన్నారు.



**జన్నారం :**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315 వ వర్ధంతిని బుధవారం జన్నారం మండల కేంద్రంలోని సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా చివరి వరకు పోరాటం చేసిన పాపన్న గౌడ్ సేవలను స్మరించుకుంటూ, అతని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు మూల భాస్కర్ గౌడ్, మోకుదెబ్బ మాజీ జిల్లా అధ్యక్షుడు బాలసాని శ్రీనివాస్ గౌడ్, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు సిటీమల భరత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిపెల్లి ఇందయ్య, బిసి సంఘం జిల్లా నాయకులు చంద్రయ్య, కదార్ల నర్సయ్య, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.



**మందమర్రి :**మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ రైల్వే గేట్ ప్రాంతంలో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న 315వ వర్ధంతిని గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, జిల్లా గౌడ సంఘం నాయకులు నోముల ఉపేందర్ గౌడ్ మాట్లాడుతూ 17వ శతాబ్దంలో దక్కన్ గడ్డపై బహుజన రాజ్యాన్ని స్థాపించిన తొలి బహుజన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని తెలిపారు. సాధారణ కుటుంబంలో జన్మించిన పాపన్న ఆనాటి సామాజిక పరిస్థితులను మార్చేందుకు పోరాడారని, దళిత బహుజనులను అధికారంలోకి తీసుకురావడమే అతని ప్రధాన లక్ష్యమని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గోల్కొండ కోటపై తొలిసారిగా జెండా ఎగరవేసిన నాయకుడిగా చరిత్రలో నిలిచారని, ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం నాయకులు మడిపల్లి వెంకటేశ్వర గౌడ్, వడ్లకొండ కనకయ్య గౌడ్, నోముల శ్రీనివాస్ గౌడ్, సట్ల సంతోష్ గౌడ్, రవీందర్ గౌడ్, దూలం రవీందర్ గౌడ్, బండారి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



**నిర్మల్ టౌన్ :**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి మరువలేనిదని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తెలిపారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.ఈ వర్ధంతి కార్యక్రమంలో అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూటమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ దొరలు, భూస్వాములు,పెత్తందార్లకు వ్యతిరేఖంగా పోరాడిన గొప్ప యోధుడని కీర్తించారు.చివరి శ్వాస వరకు అణగారిన వర్గాల పక్షాన పోరాడిన గోప్ప వ్యక్తి పాపన్న గౌడ్ అని అన్నారు.ఇటువంటి గొప్ప యోధుల జయంతి,వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమని తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఇటువంటిపోరాట యోధుల చరిత్రను నేటి తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు.అనంతరం వివిధ కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటాలను గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్,సిపిఓ జీవరత్నం,గిరిజన సంక్షేమ అధికారి అంబాజీ,ఎస్సీ కార్పొరేషన్ ఈడి శంకర్,లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్,కుల సంఘాల నాయకు లు అమరవీని నర్సాగౌడ్,అనుముల భా స్కర్,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



**మామడ :**మామడ మండలంలోని దిమ్మదుర్తి గౌడ సంఘం ఆధ్వర్యంలో సార్వాయి పాపన్న వర్ధంతి వేడుకలు వేడుకలు జరిపారు.మాజీసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్,రమణ గౌడ్,సురేందర్ గౌడ్ ,రత్న ,రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నా రు.



**గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చిల్వాకోడూరు గ్రామంలో బుధవారం రోజున గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షులు తాండ్ర చెన్నయ్య గౌడ్ మాట్లాడుతూ ఆనాటి సమాజంలో నెలకొన్న నిరంకుశ రాజరిక పోకడలకు వ్యతిరేకంగా అన్ని వర్గాలను పాపన్న గౌడ్ ఏకం చేశారని, ప్రతి ఒక్కరు సర్వాయి పాపన్న గౌడ్‌ను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.. అనంతరం అందరికీ స్వీట్లు అందజేశారు.. ఈ కార్యక్రమంలో ,గౌడ సంఘం అధ్యక్షులు తాండ్ర చెన్నయ్య గౌడ్ ,దాసరి గంగయ్య గౌడ్ ,గుండి శేఖర్ ,కనకయ్య ,కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



**ముత్తారం :** ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం వర్ధంతి సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన వీరుడు సర్వాయి పాపన్న రాచరికపు వ్యవస్థ నీడలో జమీందార్లు,జాగీర్దాల అరాచకాలను సహించలేక కత్తి పట్టిన వీరుడని,దళిత,బహుజనులు ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన సామన్య బహుజన వీరుడు పాపన్న గౌడ్ అన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గట్టు రమేష్ గౌడ్,గట్టు సదయ్య గౌడ్ ,సట్ల సతీష్ గౌడ్,దేశ్ని రవీందర్ గౌడ్,ఏగొలపు కుమారస్వామీ గౌడ్,గట్టు మహేష్ గౌడ్ లతో పాటు గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గోన్నారు.

## వేడుకగా ఆల్ఫోర్స్ గర్ల్స్ ఇ టెక్నో స్కూల్ 'ప్రథమోత్సవ్'



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:**అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ వార్షికోత్సవ వేడుకలను 'ప్రథమోత్సవ్' పేరుతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్నటువంటి విషయాలను ఎప్పటికప్పుడు సమగ్రంగా సాధన చేస్తూ విశ్లేషిస్తూ వివిధ విషయాలలో పట్టు సాధించి సమాజంలో అత్యుత్తమంగా స్థిరపడాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విశేషంగా కృషి చేసి వారికి మంచి పేరు తీసుకురావాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో గత 35 సంవత్సరాలుగా విద్యారంగ అభివృద్ధికై ఎనలేని కృషి చేస్తున్నదని, విద్యార్థులకు అన్ని రకాలుగా వసతులను కల్పించి విజేతలుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని చెప్పారు. ప్రతి విద్యార్థి సమాజంలో పై చేయి సాధించేందుకు కృషి చేయాలని చెప్పారు. వార్షిక ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీ పరీక్షలలో ప్రతిభాపాటవ పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వేడుకల సంధర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.